క్లుప్తంగా

నేటి నుంచి యోగా తరగతులు ప్రారంభం

తాండూరు రూరల్: పట్టణంలో పది రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నీరాజబాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఎంపీటీ ఫంక్షన్ హాల్లో యోగా గురువు శివానంద ఆచార్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ప్రతి రోజూ ఉద యం, సాయంత్రం తరగతులు ఉంటాయని తెలిపారు. పట్టణ, గ్రామీణా ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు చంద్రగిరిలో కార్తీక దీపోత్సవం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్ (చంద్రగిరి)లోని శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు పురందరచార్ శుక్రవార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే దీపోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

భూకైలాస్‌లో భక్తుల సందడి



స్వామివారి సన్నిధిలో భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండాలో వెలసిన భూకైలాస్ జ్యోతిర్లింగ దేవస్థానంలో భక్తులు సందడి చేశారు. శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు నీటిలో నుంచి వెళ్లి శివుడి ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్ నియామకంపై హర్షం



కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి

బంట్వారం: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ నియామకంపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బస్వాపూర్ మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన బంట్వారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన ప్రసాద్‌కుమార్‌కు మంత్రివర్గంలో చోటు కల్పిస్తే బాగుండేదన్నారు. వివిధ సమీకరణల నేపథ్యంలో కేబినెట్‌లో చోటు లభించకపోయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్‌ను నియమించి గౌరవించారని పేర్కొన్నారు.

స్పీకర్ కావడం హర్షణీయం



శశాంక్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే జి.ప్రసాద్‌కుమార్ శాసన సభ స్పీకర్‌గా ఎన్నిక కావడంపై మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్.శశాంక్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ఆదరణతోనే ఈ రోజు ప్రసాద్‌కుమార్ ఉన్నతస్థాయికి ఎదిగారన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని ఆయ న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీకి క్రమశిక్షణ గల నాయకుడిగా పార్టీలో కీలకంగా వ్యవహరించిన ప్రసాద్‌కుమార్‌కు ఉన్నతస్థాయి గౌరవం దక్కడం గొప్ప విషయమన్నారు.

భక్తితోనే ముక్తి



అభిషేకం చేస్తున్న భక్తులు

అనంతగిరి: భక్తితోనే ముక్తి లభిస్తుందని ఆలంపల్లి కెంపిన మఠాధిపతి చెన్నబసవ ప్రభుస్వామి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని శివాజీనగర్ మైసమ్మ కట్ట వద్ద రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, సామూహిక భజన చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిభావం కలిగి ఉండాలన్నారు. పట్టణంలో నెలరోజుల పాటు నిత్యం రుద్రభిషేకాలు చేయడం గొప్ప విషయమన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా మండలి ప్రతినిధులు రాజు, వెంకటేష్, రవీందర్, భోగేశ్ పంతులు, శ్రీదేవి, సదానందరెడ్డి, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీపై కొత్త ఆశలు

- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం కలిగేనా?
- అర్హులు ఎదురుచూపులు

దౌల్తాబాద్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో సామాన్య ప్రజల్లో కొంగొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. వీటి అమలులో లబ్ధిదారుల ఎంపికకు రేషన్ కార్డులు కీలకం కానున్నాయి. 2014 నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోవడం, అర్హులైన కుటుంబాల సంఖ్య పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల ప్రక్రియను ప్రారంభిస్తుందన్న ఆశతో అర్హులు ఎదురుచూస్తున్నారు.

సంక్షేమ పథకాలు అందక..

కొత్త రేషన్‌కార్డుల మంజూరులో గత ప్రభుత్వం వ్యవహరించిన విధానంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. కొత్తకార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తకార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మళ్లీ మోక్షం కలగలేదు. 2020లో లాక్‌డౌన్ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులకు అందజేసిన నిత్యావసర సరుకులు, నగదు సహాయం రేషన్‌కార్డు లేని చాలా కుటుంబాలకు అందకుండా పోయింది. లాక్‌డౌన్ ముగిసిన తర్వాత 2021 జూలైలో అప్పటి ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లే చేసి అర్థంతరంగా జారీ ప్రక్రియను నిలిపివేసింది. కనీసం ఎన్నికల ముందైనా రేషన్‌కార్డులు ఇస్తారని ఆశపడ్డ వారికి నిరాశ ఎదురైంది. ఎన్నికల ముందు తెరపైకి తెచ్చిన గృహలక్ష్మి, బీసీలకు ఆర్థిక సహాయం, డబుల్‌బెడ్‌రూం, కల్యాణలక్ష్మి తదితర పథకాలకు రేషన్‌కార్డులే ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తగా పెళ్లై వారు అనర్హులు కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు రేషన్‌కార్డులో మార్పు చేర్పులకు అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.



ప్రభుత్వంపై ఆశలు..

ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆరు పథకాల అమలుపై పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2500, సన్నబియ్యం, విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డు, 10లక్షల ఆరోగ్య శ్రీ బీమా పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం లభిస్తాయని అనేక కుటుంబాలు కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి.

రబీసాగుకు రైతుల సన్నద్ధం

తైబందీకి అనుమతి ఇవ్వాలని వినతి



సమావేశమైన రైతులు, గ్రామపెద్దలు

బొంరాస్‌పేట: చెరువు కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అనుమతించి, తైబందీ ఖరారు చేయాలని రైతులు కోరారు. మండలంలోని మెట్లకుంట ఎల్లమ్మ చెరువుకింద ఉన్న 160 ఎకరాల ఆయకట్టులో యాసంగికి సన్నద్ధం కావాలన్నారు. శనివారం గ్రామపంచాయతీలో ఆయకట్టు రైతులు, గ్రామపెద్దలు సమావేశం నిర్వహించారు. నీటిపారుదల సంఘం అధ్యక్షుడు నర్సింలునాయుడు, సర్పంచు, తదితరులు సాగు విస్తీర్ణంపై చర్చించారు. అనంతరం తైబందీ అనుమతికి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

అయ్యప్పస్వామికి పంచలోహ విగ్రహం



దాతకు రసీదు ఇస్తున్న కమిటీ సభ్యులు

కొడంగల్: కొడంగల్ పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో మూలమూర్తి విగ్రహాన్ని విరాళంగా ఇవ్వడానికి సంగారెడ్డి జిల్లా మల్లెపల్లి సర్పంచ్ జగదీశ్వర్ గురుస్వామి ముందుకు వచ్చారు. స్వామివారి మూలమూర్తిని పంచలోహంతో తయారు చేయించి కొడంగల్ ఆలయానికి సమర్పించనున్నట్లు చెప్పారు. దాతకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని భక్తులు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర యాదవ్, ఉమాపతి గురుస్వామి, బసవరాజుస్వామి, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణుసహస్ర నామ యజ్ఞం

కొడంగల్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామంలో శనివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో విష్ణుసహస్త నామ సామూహిక యజ్ఞాలు నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఐదు యజ్ఞ కుండలిలు, ఇరవై మంది దంపతులు యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు తమ ఇండ్లను శుభ్రపరుచుకొని ఇంటి ముందు, దేవాలయ ఆవరణలో రంగు రంగుల ముగ్గులు, ఆలయ ఆవరణలో పందిరి వేసి ముస్తాబు చేశారు. స్వామివారికి ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి, గ్రామ దేవాలయ భక్త మండలి సంయుక్త ఆధ్వర్యంలో గ్రామస్తులు హోమాలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి యజ్ఞం, విష్ణు సహస్ర నామ యజ్ఞం, ప్రంచామృతాభిషేకం, శ్రీవిష్ణు సహస్త నామ పారాయణం, శ్రీలక్ష్మీ అష్టోత్తర నామావళి, గీతా పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం ప్రవచనాలు చేశారు.



యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొన్న గ్రామస్తులు, ఆధ్యాత్మిక సభ్యులు

రోడ్ల పక్కనే పార్కింగ్

- స్థలం చూపకుండానే లక్షల్లో పార్కింగ్ ఫీజు వసూలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న భక్తులు
- అసహనం వ్యక్తం చేసిన పోలీసులు



ధారూరు: రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు



బైక్‌ను ఆపి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకుడు

ధారూరు: పరిగి, తాండూరు, యాలాల, బషీరాబాద్‌ల నుంచి అంపల్లి చౌరస్తా, దోర్నాల్ మీదుగా ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు వచ్చే వాహనాలకు శనివారం పార్కింగ్ ఫీజు వసూలు చేసిన వాహనాలన్నీ రోడ్డుకు ఇరువైపుల నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. రోడ్డు పక్కనే వాహనాలను నిలిపివెళ్లడం, మైకుల్లో అనౌన్స్ చేసిన ఎవరు స్పందించకపోవడంతో పోలీసులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వాహనాలను రోడ్డు పక్క నుంచి తొలగించలేక, వచ్చిపోయే వాహనాలను అదుపు చేయలేక పోలీసులు సతమతమయ్యారు. పార్కింగ్ ఫీజు కింద ఫోర్ వీలర్‌కు రూ. 100, త్రీ, టూ వీలర్‌కు రూ. 50, చొప్పున వసూలు చేసిన దోర్నాల్ నిర్వాహకులు పార్కింగ్ స్థలం చూపకపోవడంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపి జాతర ప్రాంగణంలోకి వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. పరిగి, యాలాల నుంచి వచ్చిన స్థానికుల వద్ద కూడా ఫీజు వసూలు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం అయ్యింది. పార్కింగ్ ఫీజు వేలాన్ని దోర్నాల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ భర్త తన అనుచరుడికి ఇప్పించి, సిండికేటుగా ఏర్పడి రూ.లక్షల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారని జాతర కమిటీ నిర్వాహకుల్లో ఒకరు వాపోయారు. పార్కింగ్ ఫీజు వసూలు చేసి పార్కింగ్ స్థలం చూపలేక పోయారని జాతరకు విచ్చేసిన భక్తులు ఆరోపించారు.

అనుమతి ఇవ్వడమే మా పని: ఎంపీఓ

పార్కింగ్ ఫీజు వసూలు చేసుకోవడానికి అనుమతి ఇచ్చాం. పార్కింగ్ స్థలం వద్ద వసూలు చేయకుండా రోడ్డుపైనే నిర్వాహకులు వసూలు చేయడం సరికాదన్నారు. పార్కింగ్ స్థలంలోకి వాహనాలు వెళ్లకపోవడమే ట్రాఫిక్ సమస్యకు కారణం. పోలీసులు రోడ్డు పక్కన నిలిపిన వాహనాలకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. వారు ఏం చేయకుంటే తామేం చేస్తామని ఆయన ప్రశ్నించారు. లక్షల మంది వచ్చి పోతుంటారు, వాహనాలు వేల సంఖ్యలో వస్తాయి, వాటిని అదుపు చేయాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు.

టీఆర్ఆర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నేతలు

దోమ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు సంతోషమని ఆ పార్టీ సీనియర్ నాయకులు గుజ్జ దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ఆయన ఎంతో కష్టపడ్డారని తెలిపారు. గత 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ ఎన్నో సేవలు అందించారని తెలిపారు. ఇప్పటికైనా అధిష్టానం గుర్తించి రామ్మోహన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైబయ్య, మాణిక్యం, భీమయ్య, రమేశ్, రాజు, గిరిశ్, హన్మంత్‌రెడ్డి, ఎల్లప్ప, అనంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళల మోములో 'ఉచితానందం'



బొంరాస్‌పేట: మధ్యాహ్నంలోపు బస్సులో టికెట్ తీసుకుంటున్న మహిళ

బొంరాస్‌పేట: ''టికెట్ లేని ప్రయాణం చట్టరీత్యా నేరం.. అందుకు జరిమానా రూ.500'' అనే ప్రకటన శనివారం మధ్యాహ్నం నుంచి ఇక మహిళలకు వర్తించదు. కొత్త సర్కారు మహిళలకు టికెట్ లేకుండా ఉచిత ప్రయాణం కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి గార్యంటీల్లోని మొదటి పథకం అమలు చేశారు.

హామీలను తప్పక నెరవేరుస్తాం..

పరిగి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేస్తుందని ఆ పార్టీ మహిళా నాయకురాలు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి అన్నారు. ఉచిత ప్రయాణ పథకాన్ని శనివారం పరిగి బస్టాండ్‌లో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు పథకాలను ప్రారంభించిందన్నారు. అలాగే, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచామన్నారు. త్వరలోనే మిగతా నాలుగు గ్యారంటీలను నెరవేరుస్తామన్నారు. ప్రజలు కోరుకునే విధంగా పరిపాలన నడుస్తుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజాదర్బార్‌లో పరిష్కరించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

కొడంగల్ : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ప్రజా పాలన కొనసాగించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికి చేరుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, వెంకటయ్య గౌడ్, దాము, సాయిలు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణిస్తున్న గురునాథ్‌రెడ్డి



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న బషీరాబాద్ ఎంపీపీ కరుణ, సర్పంచులు

నేడు కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ ర్యాలీ

తాండూరు: తాండూరు పట్టణంలో నేడు(ఆదివారం) కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా బుయ్యాని మనోహర్‌రెడ్డి విజయం సాధించడంతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం నుంచి వేలాది మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

తాండూరు: తాండూరు బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. పట్టణంలోని పాండురంగ స్వామి దేవాలయంలో బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు గురురాజ్ దీక్షిత్, ప్రధాన కార్యదర్శి గురురాజ్ జోషి ఆధ్వర్యంలో కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. దీపోత్సవానికి పట్టణంతో పాటు కొడంగల్ ప్రాంతానికి చెందిన బ్రాహ్మణులు, మహిళలు, పెద్ద ఎత్తున హాజరై ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం కోశాధికారి రాఘవేంద్రరావు, బొంరాస్‌పేట శ్రీనివాస్‌రావు, సమాజం ప్రతినిధులు మాణిక్‌రావు, నాగరాజు, విశ్వనాథ్‌జోషి, కరణం భీంసేన్ రావు ఉన్నారు.

నెమలిని కాపాడిన స్వాములు



ఫారెస్టు అధికారికి అప్పగిస్తున్న స్వాములు

దోమ : అటవీ ప్రాంతం నుంచి ఓ నెమలి అయ్యప్ప ఆలయం ఆవరణలోకి గాయంతో వచ్చింది. మండలంలోని పాలేపల్లి గ్రామ శివారులోని అయ్యప్ప ఆలయంలో శనివారం అయ్యప్ప స్వాములు పూజలు చేస్తుండగా ఓ నెమలిని వీధి కుక్కలు వెంబడించి గాయపరిచాయి. దీంతో ఆలయంలో ఉన్న స్వాములు అంజిలయ్య, మల్లికార్జున్ నెమలిని పట్టుకుని చికిత్స చేయించి ఫారెస్టు అధికారులకు అప్పగించారు. దీంతో ఫారెస్ట్ అధికారులు స్వాములను అభినందించారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదినం



అనంతగిరి: కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



యాలాల: కేక్ తినిపించుకుంటున్న నేతలు



మోమిన్‌పేట: కేక్‌కట్ చేస్తున్న నేతలు

మోమిన్‌పేట: ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన ఉక్కుమహిళ సోనియాగాంధీ అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరాజోద్దీన్, మహేందర్‌రెడ్డి, మహంత్‌స్వామి, బాగ్దాద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు శనివారం బంట్వారం, కోట్‌పల్లి మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు, మిఠాయిలు పంచి పెట్టి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలు ,ఆర్టీసీ సిబ్బందిని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నర్సింగ్‌నాయక్ , మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారి, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యాలాలలో

యాలాల: సోనియాగాంధీ జన్మదిన వేడుకలను శనివారం యాలాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో కేక్‌కట్ చేసి వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం అధ్యక్షుడు మైనోద్దీన్, నాగప్ప, శేఖర్, అహ్మద్, మన్సూర్ తదితరులు ఉన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో సోనియాగాంధీ కృషి, తోడ్పాటు ఎంతో గొప్పదని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్, నాయకులు కుమ్మరిస్వామి, బాల్‌రెడ్డి, విఠల్‌నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ : కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నేతలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని బొంపల్లిలో కేక్‌కట్ చేసి టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఆమె నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గందెరాములు, వార్డు సభ్యులు బోయిని చంద్రశేఖర్, కోళ్ల నర్సింహులు, కాంగ్రెస్ నేతలు గుడిసె రాములు, బషీర్, చాకలి భాస్కర్, కుర్వరమేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: సోనియాగాంధీ జన్మదిన వేడుకలు శనివారం వికారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నాయకులు కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు రత్నారెడ్డి, మల్లేశం, మల్లికార్జున్ గౌడ్, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు శనివారం మర్పల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మిఠాయిలు పంచి పెట్టి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు . కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ,సీనియర్ నాయకులు కలీమొద్దిన్, రామేశ్వర్ ,సురేష్ ,నర్సింగ్ యాదవ్ ,శేఖర్ యాదవ్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.